ఏటియి? బిళ్ళలా? బిస్కత్తులా? ఇంతున్నాయి. పోనీ బిస్కత్తులను కొని కొరుక్కు తిందామంటే కాకరకాయల్తో జేసేరేటో చేదు– ఇషం ఇన్ని నీళ్ళన్నా ఇయ్యమ్మా ఇయి మింగాలంటే గ్లాసుడు సాలవ్! కూజాడు గావాలి– అదేఁకరమవోఁ గవర్న మెంటాస్పత్రిర్లలో మంచినీళ్లు గూడా మందిచ్చినట్టు ఔన్సు గ్లాసుల్లో ఇస్తారు.

తల్లీ! నువ్విచ్చిన గ్లాసుకి డబుల్‌సైజ్ గ్లాసుడు దించకుండా తాగీసీ వోడిని– నీళ్ళనుకునేవ్! రమ్మ్కు."

❖ ❖ ❖

"నాను సావను తల్లీ–సస్తే యేడిసీవోళ్ళూ లేరు. సస్తే మాత్తరం సచ్చీ లోపల ఒక మంచిపని జేసేనన్న– సంతుష్టితో సస్తాను తల్లీ.

ఇంతకీ– మా బాబెలాగున్నాడు తల్లీ– ఇంకా సావనేదా? అలాటోడు సచ్చినా స్పెషల్ వోర్డులో స్పెషల్ సావు సస్తాడులే.

తల్లీ నా కత ఇనడానికి మొదట మీ పత్రికలోళ్ళు పదిమంది రొచ్చినారు ఒకరూ ఒకరూ జారుకోగా సివరకి నువ్వొకర్తివే మిగిలినావ్.

నా కతకూడా 'కతం' అయిపోనాది.

మా బాబు సచ్చేడా నాకు ఉరెయ్యొచ్చు. సావకపోతే 'లైపు' ఎయ్యొచ్చు.

యేదేసినా పరవానేదు. అదురుష్టం బాగుండి ఒగ్గేసేరా– సిట్టిబాబు కాడికి జేరి–ఆ బాబు పారిటీకి బతుకు బలి యిచ్చేస్తాను. మళ్ళీ ఇలాటి యెవ్వారం ఏదైనా జరిగితే అస్పత్తిరికో జైలుకో నా నెక్కడుంటే అక్కడికి రా తల్లీ!

ఇప్పటికే సాలా రాసున్నావు. ఇక చాల్తల్లీ– పువ్వులూ పాలూతో పదికాలాలు హాయిగా బతుకు."

### చివరి మాట

"గాంధీజీ" బహు దొడ్డ సిద్ధాంతం కాని దేశం నిండా గాంధీలు ఉంటేనే – అది ఆచరణకు సాధ్యపడుతుంది.

పుట్టింది ఒకే గాంధీ. అతడినైనా బతకనివ్వలేదు దేశం.

గాంధీజం గొప్పదా? కాదా? అన్నది కాదు సమస్య. దానికి మనం తగుతామా అన్నదే ప్రశ్న.

మనం దానికి తగకపోతే – మరో సిద్ధాంతం ప్రజ వెదుక్కోవాలి. **– బీనాదేవి**

**(యువ, 1.12.1984)**

# అతడూ - ఆమే

**పం**జరం బతుకుకి అలవాటుపడిపోయిన చిలకలా–

బలంలేని అడుగుల్తో –

చెయ్యని నేరానికి శిక్ష అనుభవించవలసిన మనిషిలా–

కుర్చీ అంచున–

భయం భయంగా కూర్చుంది – ఆమె

ఆమె కాళ్ళముందు – ద్వారంలోంచి పడుతున్న సాయంకాల ఎండ దేముడు పరచిన బంగారు చాపలా ఉన్నా –

ఆమె చూపులో దేముడు ఉన్నాడన్న నమ్మకం కంటే –

లేడన్న భయమే కనిపిస్తుంది.

ఊపిరి సలపని మనిషిలా ఆమె ఒక్కసారి గుండెల నిండా ఊపిరి పీల్చుకొని పైట రెండో భుజం మీద కూడా కప్పుకొని

ఎదురు కుర్చీలో ఉన్న అతనివేపు –

వికృతమైన పెళ్ళికూతురు – అందమైన పెళ్ళికొడుకు వేపు చూసినట్టు భయంగా బాధగా చూసింది ఆమె–తను అతి అందంగానే ఉన్నా

❖ ❖ ❖

ఎదురు కుర్చీలో కూర్చున్న అతను –

జీవితమంతా తపస్సు చేసి –

దేవుడు లేడని కనుక్కున్న మనిషిలా –

నిర్లక్ష్యంగా–నిర్భయంగా ఉన్నాడు.

మనిషి కళ్ళల్లో కొంచెం నీరసం కనిపించినా –

తనకు ముప్ఫై ఏళ్ళు పెరిగిన బలం వంట్లోనూ –

సత్తువ మనసులోనూ – ఉన్నాయి.

అతను ఆమెను పరిశీలనగా చూసేడు.

"వెలిసిపోయిన వెన్నెల బొమ్మలా ఉంది"

అనుకున్నాడు.

సమంగా ఆ మాటలే అన్నాడు – వాళ్ళు మొదటిసారి – పార్టీలో కలుసుకున్నప్పుడు – ఇందిరని చూపిస్తూ..

"పాపం – ఆమె భర్తని ఉరితీశేసారు – రాజకీయ నేరానికి" జవాబు చెప్పింది ఆమె.

పసిపాప మీద నుండి –కారు పోనిచ్చినవాడిలా –

తనని తానే క్షమించుకోలేనన్న–బాధతో –

చూసేడు అతను

"పాపం ఆమె గర్భిణి కూడా" అతని చూపుని

చూడకుండానే–అన్నాదామె.

తను –అన్నమాటలను – భగవంతుడు కూడా – క్షమించడు – అన్న బాధతో –

"నేను మాటలు వచ్చిన మృగంలా కనిపించడం లేదూ?"

తనను తానే శిక్ష వేసుకుంటూ–ఆమె వైపు ప్రార్థనా పూర్వకంగా చూస్తూ – అడిగేడు.

"తెలియక చేసిన తప్పుకి ఎవరేం అంటారు?"

పాపం–ఆవిడ భర్త బతికి ఉన్నప్పుడే–వెన్నెల బొమ్మే. ఇప్పుడు వెలిసిపోయింది – అతి సులువుగా క్షమించేసింది ఆమె.

ఆవిడ క్షమే–అతని బాధని పెద్దది చేసింది.

పాపం–ఆవిడకి పుట్టబోయీ బిడ్డకి–పుట్టేసరికే తండ్రి ఉండడు. దురదృష్టవంతురాలు–సానుభూతితో అన్నాడు– అతను.

"ఆవిడ అలా అనుకోవడం లేదు. పిల్లని – తండ్రి అడుగులో నడిపిద్దామని ఆమె కోరిక – కడుపులో కారు చిచ్చు ఉన్నా –

ఆమె నిండుకొండ.

"పేలని అగ్నిపర్వతం" అన్నాదామె.

ఆవిడకు నేను చెయ్యగల ఉపకారం–ఏమన్నా–ఉందా" అభ్యర్థించేడు. ఆత్మాభిమానంగల మనిషి–తనకు ఎవ్వరి సాయం – అక్కర్లేదంటుంది.

"తన తోవలో నిప్పులు పొయ్యని ప్రతివాళ్ళూ

తనకు సహాయం చేసినట్టే అంటుంది".

"ఆవిడ దేవత – చెయ్యెత్తి దణ్ణం పెట్టాలి" అన్నాడు.

అతను – మనసులో సాష్టాంగపడుతూ.

ఈ సంఘటన కొన్ని సంవత్సరాల కింద జరిగినా – అతనికి సుస్పష్టంగా గుర్తుకు వచ్చింది.

❖ ❖ ❖

ఆమె కాళ్ళ ముందు బంగారు చాప కొంచెం పొడుగైంది.

గోడ గడియారం చప్పుడు – వాళ్ళ గుండెల్లో – సమ్మెట పోటుల్లా ఉన్నాది.

బాధతో నిండిపోయిన వాళ్ళ గుండెలు–మాటలు మరచి పోయి మూగవైపోయేయి.

ఏమనాలో – తోచక – అతను ఇబ్బందిగా కదిలేడు కుర్చీలో

గడియారం గంట కొట్టింది.

ఎక్కడో – కళ్ళు విడని వీధి కుక్క పిల్ల తల్లికోసం ఏడిచింది.

ఏదో మాట్లాడాలి–కాబట్టి

ఎలా ఉన్నావ్?

అతనే అడిగేడు

ఆమెని అతను ఎప్పుడూ అలాగే పలకరిస్తాడు. కానీ ప్రతి సారీ అలా పలకరించినప్పుడు అతని కంఠస్వరంలోనో – ముఖ కవళికలలోనో–ఎంతో కొంత మార్పు ఉంటుంది. ఇప్పటి పలక రింపులో కంఠస్వరం–అతని అలాంటి కంఠస్వరంతో – అది వరకు – అతను ఒక్కసారే పలకరించేవాడు. అప్పుడామె తెల్లని ఆసుపత్రి పక్కమీద పడుకొని ఉంది. పరుపు మీద – నిలువెత్తు దంతం బొమ్మలా ఉంది.

గోడ తెలుపు.

మీద తిరుగుతున్న ఫేన్ తెలుపు –

వెలుగుతున్న ట్యూబ్‌లైట్ తెలుపు.

చుట్టూ ఉన్న మనుషుల బట్టలు తెలుపు.

అప్పుడే మత్తుమందు నుంచి కోలుకుంటున్న – ఆమెకు చచ్చిపోయి తెల్లమేఘాల దొంతర్ల మధ్య చిక్కుకు పోయినట్టు – అనిపించింది. కాని వెంటనే పక్కని వేలాడుతున్న రక్తపు సీసాను చూసి జడుసుకుంది.

సమంగా ఆదే టైముకి అతను భగవంతుళ్ళా "ఎలా ఉన్నావు?" అని పలకరించేడు. ఆ పలకరింపులోని ఆప్యాయతా – అభిమానం–గౌరవం–ఆమె ఇప్పటి వరకు మరిచిపోలేక పోయింది. ఇప్పటి పలకరింపులో కూడా–మళ్ళీ–అదే ఆప్యా యతా–అభిమానం–గౌరవం–తను బతికి ఉన్నన్నాళ్ళూ–ఎన్నాళ్ళు బతు కుతుందో తెలియకపోయినా–మరచిపోలేనని–భయపడి కళ్ళు దించుకుంది.

"బాగానే ఉన్నాను" అప్రయత్నంగా చెప్పిన ఆమె జవాబు – మీద హెలికాప్టర్ చప్పుళ్ళో కరిగిపోయింది.

"ఆ హెలికాప్టర్ నుంచి –భగవాన్ ! ఒక బాంబు పడి – తను చచ్చిపోతే" ఎంత బాగుండును–అనుకుంది ఆమె.

"రేపు లేని మనిషిని నేను. చల్లని చావే నాకు కన్నతల్లి వొడి భగవాన్!"

ఇలా కొంచెం కొంచె ఎందుకు చంపుతావ్ నన్ను?

కిందటి జన్మలో

ఏ పురుగుల పువ్వుల్తో పూజించేనో!

ఏ నిప్పుల నైవేద్యం పెట్టేనో

నా పూజల ఫలం –

నా నోముల పంట –

"ఇలా పెను పళ్ళచక్రాల మధ్య –

కోసుకుపోవడమే కాబోలు"

కనిపించని దేముణ్ణి – తిట్టడానికైనా ఆమెకు ఓపిక లేకుండా పోయింది.

తను లారీ కింద పడిపోయినట్టూ – లారీ చక్రాలు

తనమీద నిలబడిపోయినట్టూ – బాధ పడుతోంది – ఆమె.

దీన దయాళూ....

ఏమిటి నీ క్రూరలీల?

ఏ మండే ఎడారిలో

ఏ రగిలే గుండంలో

ఇంకిపోయే – నా కన్నీళ్ళు?

అని భయంతో వణికిపోయింది.

పువ్వులాంటి హృదయం – ఆమెది

రెండేళ్ళ కింద–ఆమె కారు 'రివర్స్' చేస్తున్నప్పుడు తన కూతురి ఆటబొమ్మ చక్రం కింద పడి పగిలిపోతే–రోజల్లా కన్నీళ్ళు – ఆపుకోలేక పోయింది.

ఇప్పుడు –తన హృదయం–ఎండి– బండబారి పోయింది.

రేపటికి, ఒక వ్యక్తి నిండు ప్రాణాలు పోతాయి.

తన కూతురు అనాథ – అయిపోతుంది.

కాని బతుకులో –

తనకి కావలసిన మనిషిని –

ఆఖరుసారి కలుసుకున్నప్పుడు –

ఆడడానికి మాటా –

కార్చడానికి కన్నీరూ –

కరువైపోయి ఆమెకు.

అతనిది ఎప్పుడూ నిండుగుండే –

బాలభానుడిలా ప్రశాంతంగా – గంభీరంగా –

ఎప్పుడూ ఉండగలడు అతను –

ఆఖరికి "నిన్ను రేపు ఉరి తీస్తారు" అని ఎవరైనా చెప్పినా – అతని చిరునవ్వు చెరగదు.

కానీ అంతటి ధైర్యశాలి–ఒక్కసారి గాఢంగా నిట్టూర్చేడు – ఆమె ధైర్యం చూసి.

ఆ నిశ్వాస–ఆమె చెంపకు –కాలనాగు బుసలా – తగిలింది.

ఆమె కళ్ళు ఎత్తి అతన్ని చూసింది.

అతను–కిటికీ లోంచి ముస్తాబైన పెళ్ళికూతురులా

ఉన్న పూలమొక్క వేపు చూస్తున్నాడు.

రెండు పెద్ద తెల్ల పువ్వుల్లో – పుట్టుకొస్తున్న బంగారు మొగల్లా – రెండు బంగారు పిచ్చికలున్నాయి. అతనికి బంగారు పిచ్చిక లంటే ఎంతో ఇష్టం. రెండేళ్ళ కిందట–తన పుట్టినరోజుకి – తను వేసిన బంగారు పిచ్చికల పెయింటింగ్ – ఆమెకి ఇస్తూ "నీకు బంగారు పిచ్చికని చూస్తే ఏమనిపిస్తుంది" అని అడిగేడు.

"తీరుతున్న కోరిక" అంది ఆమె సున్నితంగా.

అతను బంగారు పిచ్చికల్ని–చూస్తే ఆనందించకుండా ఉండలేడు.

కాని ఇప్పుడు మాత్రం–అతని ముఖంలో – ఆనందం లేదు సరిగదా–లోతు తెలియని గాంభీర్యత – కనిపిస్తోంది.

అతనిలో ఏ చలనమూ లేదు.

తన గురించి అంత బాధ పడుతున్నాడా – అని భయపడింది ఆమె.

"కొంపతీసి – అతని గురించేనా అంత బాధా? అన్నతలపు రాగానే – భయంతో వణికిపోయింది. అకస్మాత్తుగా నిద్రలోంచి

లేచినవాడిలా అతను "ఎలా వుంది నీ కూతురు" అని చిరునవ్వు నవ్వుతూ అడిగేడు.

ఆమె తుళ్ళిపడింది.

తన కూతుర్ని అతను ఎప్పుడూ యశోద అనే అంటాడు.

అది వరకు-ఒక్కసారే - అన్నాడు. ఎలా ఉంది నీ కూతురు అని-అప్పుడు ఆమె ఆస్పత్రిలో పురుడు పోసుకుంది.

అప్పుడు - అతన్నీ - ఆమెనూ కూడా 'కండిషనల్ బెయిల్' మీద వదిలేరు - జెయిల్లోంచి ఆస్పత్రికి పురిటి మంచం మీద - కలకీ, వాస్తవానికి మధ్య స్థితిలో ఆమె ఉన్నప్పుడు నిశ్శబ్దంగా నీడలా నడచి వచ్చి తన కాళ్ళవైపు నిలబడి - "ఎలా వుంది నీ కూతురు?" అని అడిగేడు.

"ఉయ్యాల్లో ఉంది -చూడండి" అంటున్నప్పుడు ఆమె చెంప మీద ఒక కన్నీటి ముత్యం మెరిసింది. "నేను చూస్తాలే. కాని తన కూతురు ఎలా ఉందో తల్లే చెప్పగలదు? నవ్వుతూనే అన్నాడు. కాని ఆ మాటలు-అతను నవ్వులాటకి అన్నవి కావని - అతను అన్నది అతను నమ్ముతున్నాడనీ-అతని కంఠస్వరంలో ధ్వనించింది.

"రేపు చెప్తా - అది - ఏమనాలో తోచక.

అతను ఉయ్యాల వేపు నడిచివెళ్ళి - పిల్లని రెప్ప వెయ్య కుండా-చూసేడు. "గుళ్ళో దీపంలా ఉంది. యశోద అని పేరు పెట్టు" అన్నాడు.

అతను ఎవ్వర్నీ ఏదీ కోరడే. అడగందే సలహా ఇవ్వడు.

అలాంటి అతను కోరక - కోరక - ఒక్క కోరిక కోరేడు. అతని కోరిక - ఆజ్ఞగా తీసుకుంది. కూతురుకి యశోద అనే పేరు పెట్టింది. ఆలోచనల్లోంచి - ప్రస్తుతానికి వచ్చి - అతని ప్రశ్నకి జవాబుగా - "స్కూల్లో వెయ్యాలి" అంది.

"స్కూళ్ళూ - చదువులూ - నిరుద్యోగులూ ఎప్పుడూ ఉన్నవే. ఎలా ఉంది యశోధ?" తరచి అడిగేడు.

ఆమె మొదటిసారి అతని దగ్గర నిజం దాచింది. యశోధ - కనిపించని తండ్రి కోసం - బెంగ పెట్టుకొని - మంచం పట్టిందన్న నిజం భరించరానిది. ఎప్పుడూ ఒక్కటే అల్లరి. పుస్త కాల్లో బొమ్మలు ఎంత చూపినా - తనివి తీరదు - ఆ పిల్లకి ముఖం పక్కకు తిప్పుకొని రహస్యం చెబుతున్నట్టు - అతి మెల్లగా అనగలిగింది.

"చివరి క్షణాల్లో కూడా ఒక అమాయకపు ప్రాణిని మోసం చేయిస్తున్నావా? అబద్ధం ఆడక తప్పని పరిస్థితిలో పెడుతున్నావా? భగవాన్! మనసులో ప్రార్థించింది. "యశోద పెద్ద య్యేక ఏమిటి చెయ్యాలనుకుంటున్నావ్?" ఉత్సాహంగా అడిగేడు. "న్యాయం-ధర్మం-నిజం కోసం నిలబడాలని నా కోరిక" అంత పెద్దగా అన్నందుకు తానే ఆశ్చర్యపోయింది.

"తథాస్తు" కళ్ళు మూసుకొని అన్నాడు. ద్వారంలో ఎండ రెండో గోడ వరకూ పాకింది.

❖ ❖ ❖

అంతవరకూ మూలని కుర్చీలో కూర్చొని వీళ్లవేపు చూడ కుండా కిటికీలోంచి బైటకు చూస్తున్న మూడోమనిషి- దేముడి గుడిలో జోళ్ళతో నడవవలసినందుకు చింతిస్తున్నవాడిలా అతని వద్దకు చప్పుడు కాకుండా నడిచి వచ్చి - సిగరెట్టు ఇచ్చి లైటరు వెలిగించేడు.

అతను సిగరెట్టు వెలిగించుకున్నాక-ఆ మూడో వ్యక్తి "సార్-నన్ను రాక్షసుడు" వాక్యం పూర్తి చెయ్యలేకపోయేడు.

ఆ మూడో వ్యక్తి చప్పుడు కాకుండా వరండాలోకి నడిచి వెళ్ళి-సిగరెట్టు అంటించేడు,

ఎక్కడో వానపాము వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు అనిపించింది అతనికి.

❖ ❖ ❖

తర్వాత కొంతసేపటికి ఆమే - ఆ మూడో వ్యక్తీ - జెయిల్ ఆవరణలో నడుస్తున్నారు.

"మీరు క్షమిస్తే..." తలవంచుకొని నడుస్తున్న అసిస్టెంట్ జెయిలర్ (ఆ మూడ వ్యక్తి) అన్నాడు.

ఆమె నడుస్తూనే అతని వేపు చూసింది. ఆశ్చర్యంగా, సర్వ నాశనం అవుతున్న ఆమెని అతను కోరగలిగింది" ఏమిటా అన్నది ఆమె ఆశ్చర్యం

"మీ వార్ని రోజూ చూస్తూనే ఉన్నాను" భక్తితో అన్నాడు అతను.

ఆమె నడుస్తూనే ఉంది.

"మీ అడ్రసు ఇస్తే మీ యశోదని చూడడానికి వస్తాను - రేపు"

అప్రయత్నంగా ఆగింది ఆమె.

రేపు

అతనికి - అంటే ఆమె భర్తకి ఉరితీస్తారు.

**(ఆంధ్రజ్యోతి, దీపావళి 10.11.1989)**